681) దేసాక్షి / భైరవి

ప॥ ఏపొద్దు చూచిన దేవు డిటానే యారగించు। రూపులతో బదివేలు రుచులైనట్లుండెను॥

చ॥ మేరుమందరాలవలె మెరయు నిడ్డెనలు। సూరయ చంద్రులవంటి చుట్టుబళ్ళేలు।
ఆరనిరాజాన్నాలు అందుపై వడ్డించగాను। బోరన చుక్కలు రాసివోసినట్లుండెను॥

చ॥ పలుజలధులవంటిపైడివెండిగిన్నెలు। వెలిగొండలంతలేసి వెన్నముద్దలు।
బలసినచిలుపాలు పంచదార గుప్పగాను। అలరువెన్నెలరస మందిచ్చినట్లుండెను॥

చ॥ పండినపంటలవంటిపచ్చళ్ళు గూరలును। వండి యలమేలుమంగ వడ్డించగా।
అండనే శ్రీవేంకటేశు డారగించీ మిగులగ। దండిగా దాసులకెల్ల దాచినట్లుండెను॥